క్లుప్తంగా

నేడు జూనియర్ కళాశాలల బంద్

రైల్వేకోడూరు అర్బన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా శుక్రవారం జూనియర్ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏబీవీపీ కళాశాలల అధ్యక్షుడు విఘ్నేష్ తెలిపారు. అలానే బంద్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో వసతులు లేకపోవడంతోపాటు ప్రవేటు కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నందలూరు జడ్జి కె. లత

నందలూరు(రాజంపేట): సెప్టెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని నందలూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.లత తెలిపారు. నందలూరు కోర్టులో గురువారం జరగనున్న జాతీయ లోక్ ఆదాలత్‌కు సంబంధించి న్యాయవాదులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌కు రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులను పరిష్కరించాలని తెలియజేశారు. అలాగే ఈ జాతీయ లోక్‌ఆదాలత్‌కు సంబంధించి ప్రతి రోజు ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్టు ఆమె అన్నారు. న్యాయవాదులు నరసింహులు, ఏ.వి. సుబ్రమణ్యం, మహమ్మద్‌అలీ, సుబ్బరామయ్య, ఆనంద్‌కుమార్, అనుదీప్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

సంబేపల్లె : మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ వసంతాభాయ్‌కి అంగన్‌వాడీ కారకర్తలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ 2022 ఆగస్టు నెల వేతనంతోపాటు కేంద్రాలకు గ్యాస్‌కు సంబంధించిన పరికరాలను అందించాలని వారు కోరారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రితో విద్యార్థులు తదితరులు

చిట్వేలి : చిట్వేలి హెల్ప్‌లైన్ సొసైటీ ఆధ్వర్యంలో పెద్దూరు ఎస్టీకాలనీ పాఠశాల విద్యార్థులకు గురువారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కెఎస్ అగ్రహారం నివాసి నాగిరెడ్డి తిరుమలరెడ్డి మనుమడు ఛాయా అర్జున్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని విద్యాసామగ్రి, స్వీట్స్‌ను పంపిణీ చేశారు. తిరుమలరెడ్డి కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయు సాంబశివారెడ్డి, సీహెచ్‌ఎస్ ప్రధాన కార్యదర్శి గాడి ఇంతియాజ్ అహ్మద్, సభ్యులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాటూరులో ఘర్షణ

నందలూరు(రాజంపేట) : పాటూరు గ్రామంలో మొహర్రం సందర్భంగా ఘర్షణ చోటుచేసుకుంది. గురువారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన దళిత యువకులపై అదే గ్రామానికి చెందిన యువకులు తాగిన మత్తులో దాడి చేసినట్లు దళిత యువకులు పోలీసులకు తెలియజేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాధవరంలో పారిశుధ్య పనులు

సిద్దవటం : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముంద జాగ్రత్తగా గ్రామంలో హరిత రాయబారుల ద్వారా పంచాయతీలో పారిశుధ్య పనులు చేయించినట్టు పంచాయతీ కార్యదర్శి చేపూరి లక్ష్మినరసయ్య తెలిపారు.

ఆలయాలు సంస్కృతికి నిలయాలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న జెడ్పీటీసీ

సంబేపల్లె : ఆలయాలు సంస్కృతికి నిలయాలని జెడ్పీటీసి కవిత అన్నారు. గురువారం మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ దిగువరాజుగారిపల్లె దళితవాడలో నూతనంగా నిర్మించిన మాతమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో జెడ్పీటీసీ పాల్గొన్నారు. ఆమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఓబులవారిపల్లె : పున్నాటివారిపల్లె రైల్వేగేటు సమీపంలో గురువారం ఆటో ఢీ కొన్న సంఘటనలో పోలి శ్రీనివాసులు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గాదెల కొత్తపల్లి దళితవాడకు చెందిన పోలి శ్రీనివాసులు చిన్నఓరంపాడుకు స్కూటర్‌పై వెళ్తుండగా పున్నాటివారిపల్లి రైల్వేగేటు సమీపంలో ఆటో ఢీ కొంది. దీంతో కాలికి గాయం కాగా చికిత్స నిమిత్తం 108లో కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

ప్రతి గడపనా సంక్షేమ పథకాల లబ్ధి

- రాయలసీమకు చంద్రబాబు చేసింది శూన్యం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమనికి ప్రజలు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గురువారం చిన్నఓరంపాడు గ్రామంలో సచివాలయ పరిధిలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, నాయకులు అధికారులతో కలిసి అయ్యలరాజుపల్లె దళితవాడ, కమ్మపల్లె దళితవాడ గ్రామాలలలో గడప గడపకు తిరిగారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం ద్వార గరిష్టంగా లక్ష రూపాయల నుంచి ఆరు లక్షల రూపాయల వరకు సంక్షేమం అందిందన్నారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రతి గడపకు వెళ్లి వారికి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల గురించి వివరించి ఇంకా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ, విద్యుత్ సమస్యలు, కమ్మపల్లె దళితవాడ గ్రామస్తులు జెడ్‌హెచ్‌డీసీ భూముల సమస్యలను కొరముట్ల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కలరించాలని ఆదేశించారు. అనంతరం కొరముట్ల మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక ప్రభుత్వంపై విషయం చిమ్ముతున్నాయన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాన్ ప్రజలకు ఏమీ చేస్తారో చెప్పకుండా ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

నాడు శ్రీలంక అని నేడు అవే పథకాలు కాపీ

కొన్ని నెలల క్రితం సంక్షేమంపై చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రాన్ని శ్రీలంక చేస్తున్నారా అని వ్యాఖ్యానించి.. నేడు అవే పథకాలను కాపీ కొట్టి ఏం తమ్ముళ్లు అదిరిందా అని అంటుండడం విడ్డూరంగా ఉందన్నారు. కుప్పంని రెవెన్యూ డివిజన్ చేసుకోలేని చంద్రబాబు రాయలసీమపై సవతి ప్రేమని చూపిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల గురించి టీడీపీ అధినేత మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పోలవరం బాబుకు ఏటీఎం అని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను కొరముట్ల మార్చిపోయారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రాష్ట్రానికి చేసింది శూన్యమని, రైల్వేకోడూరు అభివృద్ధిని సైతం టీడీపీ విస్మరించిందన్నారు. చంద్రబాబు ఇచ్చిన 600 హామీలు ఎక్కడ అమలు చేశారో చూపించే సత్తా ఏ టీడీపీ నాయకుడికి లేదని వాపోయారు. బాబు పాలనలో మేనిఫెస్టోను పార్టీ వెబ్‌సైట్ నుంచి ఎందుకు తీసేశారో ఇప్పటి వరకు సమాధానం చెప్పాలేని పార్టీ దేశంలో టీడీపీనే అని గుర్తుచేశారు. ప్రజలకు మంచి చేస్తున్న వలంటీర్ల వ్యవస్థపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో ఓటుతో వారికి జవాబు చెప్పడం ఖాయమని అభిప్రాయపడ్డారు. 2024 ఎన్నికల్లో వంద అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబును ప్రజలు నమ్మే రోజులు పోయాయన్నారు. జిల్లా వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు పంజం సుకుమార్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల నాగమ్మ, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు టి.కృష్ణరెడ్డి, మాజీ సర్పంచ్ ముక్కా రమేష్ కుమార్‌రెడ్డి, సర్పంచ్ గద్దె సిద్దమ్మ, సీనియర్ నాయకులు రంపా బాలిరెడ్డి, బాబురెడ్డి, సానుగారి సుబ్బారెడ్డి జిల్లా టూరిజం డైరెక్టర్ జి.సుధాకర్‌రాజు, సుంకేసుల రఫీ, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లకు విరాళం

వీరబల్లి(రాజంపేట) : రాజంపేట నియోజకవర్గం వైఎస్ఆర్‌సీపీ నాయకుడు గాలివీటి విజయసాగర్‌రెడ్డి(మదన్‌రెడ్డి) గురువారం వీరబల్లి మండలంలోని 68 అంగన్‌వాడీ సెంటర్లకు చార్ట్స్, మ్యాట్స్ కోసం రూ. లక్ష విరాళాన్ని ఇచ్చారు. మండలంలోని అన్నీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల అభ్యసన, అభివృద్ధి కోసం ఈ విరాళాన్ని ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విరాళం మొత్తాన్ని పెద్దవీడు సర్పంచ్ నాగిరెడ్డికి అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్‌లు, ఆయాలు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమమే పీఎం లక్ష్యం

రైల్వేకోడూరు అర్బన్/రాయచోటి టౌన్ : రైతుల సంక్షేమమే భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ లక్ష్యమని బీజేపీ కన్వీనర్ అరమాటి శివగంగిరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా హార్టికల్చర్ స్టేట్ కన్వీనర్ తోట శ్రీనివాసులు అన్నారు. రైల్వేకోడూరు, రాయచోటిలలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజనలో భాగంగా గురువారం వారు ప్రధాని మోడీ ప్రసంగాన్ని ఆయా ప్రాంతాల్లోని రైతులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ సన్నకారు రైతులకు మొదటి విడతగా 2 వేల రూపాయలు అందించడం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

హరిత రాయబారులకు వేతనాలు



వేతనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా

సుండుపల్లె(రాజంపేట) : సుండుపల్లె పంచాయతీలో పనిచేస్తున్న హరిత రాయబారుల(పారిశుధ్య కార్మికులు)కు ఎట్టకేలకు వేతనాలు అందాయి. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కృషి ఫలితంగా 21మందికి ఒక్కొక్కరికి రూ.30వేల చొప్పున నాలుగు నెలల జీతాలు మంజూరయ్యాయి. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా జీతాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులకు అవసరమయ్యే గ్లౌజులు, వస్త్రాలు తదితర పరికరాలను తన సొంత నిధులతో సమకూరుస్తామని హరిత రాయబారులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రామస్వామిరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు భానుప్రకాశ్‌రెడ్డి, రాయవరం కృష్ణమోహన్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనరు రహిమాన్‌ఖాన్, కేతిరెడ్డి కృష్ణారెడ్డితోపాటు పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, అంకితభావంతో ఉన్నత శిఖరాలకు



మాట్లాడుతున్న జడ్జి పి.శంకర్

రాయచోటి అర్బన్ : ప్రతివిద్యార్థి క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో విద్యనభ్యసించినప్పుడే ఉన్న తశిఖరాలకు చేరుకోవచ్చునని రాజంపేట సెకండ్ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పి.శంకర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ ప్రొగ్రాంను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తరగతి గదిలోని పాఠాలను ప్రయోగశాలల్లో నిర్ధారించుకుని పూర్తి అవగాహనతో పాఠ్యాంశాలను అభ్యసించాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కళాశాల ఏడీ సుధాకరరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల పలు శిక్షణ సంస్థలతో ఎంఓయూ కుదర్చుకుని 100 శాతం ఉద్యోగావకాశాలను కల్పిస్తామంటూ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలాజీ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ నాగశ్రీలక్ష్మి

సంబేపల్లె : మండల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు విశేష కృషి చేయాలని ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ సభా భవనంలో నిర్వహించిన మండల సమావేశానికి డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలసి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఉపాధి హామీ పనులను అందరికి గిట్టుబాటు అయ్యేలా చూడాలని సూచించారు. ప్రజా సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు. సచివాలయ సిబ్బందితో అభివృద్ధి ముడిపడి ఉండటం వలన వారు మరింత బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రధానంగా అమ్మ ఒడి, విద్య దీవెనపై వస్తున్న సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపి పరిష్కరించాలన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిల చొరవతో మండలానికి మరిన్ని నిధులు మంజూరవుతున్నాయని, ఆ నిధులతో మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆమె కోరారు. అనంతరం మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. జెడ్పీటీసీ కవిత, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహులు, తహసీల్దార్ మహేశ్వరిబాయ్, సర్పంచులు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ మెంబర్, మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు



మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె : ఉద్యాన సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని లక్కిరెడ్డిపల్లె ఉద్యానశాఖ అధికారిణి టి.నాగమణి పేర్కొన్నారు. గురువారం మండలంలోని దిన్నెపాడు గ్రామంలోని పర్వతరెడ్డిగారిపల్లె, నరసింహరావుగారి పల్లె, దిన్నెపాడు కస్బాలో ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ముదురు మామిడిలో చేపట్టవల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం శాస్త్రవేత్త బాలహుస్సేన్ మాట్లాడుతూ పూలతోటలు, కూరగాయల సాగులో నాణ్యత పెంచే యాజమాన్య పద్ధతులు పాటించడంతోపాటు కూరగాయలను ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణకు సరైన సమయంలో మందులు పిచికారీ చేస్తే పంట దిగుబడి పెంచుకోవచ్చన్నారు. కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యానశాఖలో నీటి ఎద్దడి సమయంలో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. వాటర్ షెడ్ చైర్మన్ సుబ్బరాజు, ఉపసర్పంచ్ రఫీక్, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సర్వేను వేగవంతం చేయండి

పెనగలూరు : ఓటరు జాబితాపై ఇంటింటా సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీధర్ రావు అన్నారు. గురువారం సాయంత్రం పెనగలూరులో బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఓటరు జాబితా సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకొందని, ఆలస్యం చేయకుండా సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సర్వేపై నిర్లక్ష్యంగా ఉన్న బీఎల్‌ఓల జాబితా తన వద్ద ఉందన్నారు. శుక్రవారం నుంచి సర్వేను కేటాయించిన కుటుంబాలకంటే అధికంగా చేసి సాయంత్రానికి రిపోర్టు ఇవ్వాలన్నారు. ప్రతిరోజూ ఈ రిపోర్టును ఉన్నతాధికారులకు చేరవేస్తామన్నారు. పేరుపేరున సర్వేపై ఆరా తీశారు. మార్పులు, చేర్పులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



నిరసన తెలుపుతున్న విద్యుత్ కార్మికులు

రాజంపేట రూరల్ : కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని విద్యుత్ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. స్థానిక డివిజనల్ విద్యుత్ కార్యాలయం వద్ద గురువారం భోజన విరామ సమయంలో జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని కోరారు. అదే విధంగా ఈపీఎఫ్ టు జీపీఎఫ్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. జేఎల్ఎంలను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. వారి కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలియజేశారు.

కేంద్రీయ విద్యాలయంలో వార్షికోత్సవ వేడుకలు

రాజంపేట : రాజంపేట కేంద్రీయ విద్యాలయంలో జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ-2020) మూడవ వార్షికోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేవీఎస్ డెస్క్ టాప్‌లు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్‌లతో దేశ వ్యాప్తంగా వివిధ కేవీలలో 12347 క్లాస్‌రూంలను ఏర్పాటు చేసిందన్నారు. పీఎం విద్య, విద్యాంజలి పోర్టల్, ఉపాధ్యాయలకు బోధనాపరమైన మార్పు, శిక్షణ, తల్లిదండ్రుల పాత్ర, వృత్తి విద్య విషయంలో నైపుణ్యం, నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ ఫౌండేషన్ స్టేజ్, బాల్యాటిక పరిచయం , నిపున్ ఇనిషియేటివ్స్ తదితర అంశాల గురించి చర్చించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె

రాజంపేట : సమస్యల సాధన కోసం ఆగస్టు 1 నుంచి మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెకు వెళుతున్నట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవి కుమార్ తెలిపారు. గురువారం సమ్మె నోటీసును మున్సిపాలిటీ మేనేజరు శేషఫణికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. ఆగస్టు 7న చలో రాయచోటిని జయప్రదం చేయాలని కార్మికులను కోరామన్నారు. గతంలో మున్సిపాలిటీ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ ఓబయ్య, ప్రధానకార్యదర్శి ప్రసాద్, కోశాధికారి లక్ష్మీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూముల ఆక్రమణ

పెనగలూరు : కట్టావారిపల్లిలో దళితుల భూములను అగ్రకులాల వారు ఆక్రమించారని దళితులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కట్టావారిపల్లి దళితవాడలో సర్వేనెంబరు - 1119/3లో భూమి ఆక్రమణకు గురైందని, అలానే కాంతమ్మ అనే మహిళకు చెందిన భూమిని కూడా అగ్రవర్ణాల వారు ఆక్రమించి రోడ్డు వేశారన్నారు. ఆక్రమణకు గురైన భూములను కాపాడి దళితులకు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై విచారణ చేపడతామని తహసీల్దార్ తెలిపారు.

27ఆర్‌కేడీ152 తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కట్టావారిపల్లె దళితులు

అర్హులకు పక్కా గృహాల మంజూరు



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పక్కా గృహం మంజూరయ్యేలా చూసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని హౌసింగ్ ఈఈ వెంకటదాస్‌కు ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని స్థానిక ఎంపీపీ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో జగనన్న కాలనీలతోపాటు లక్కిరెడ్డిపల్లెలోని ఎస్టీ కాలనీలో పక్కా గృహాల మంజూరు, జరుగుతున్న నిర్మాణాలపై ఆరా తీశారు. జగనన్న కాలనీలలో హౌసింగ్ ఇళ్ల నిర్మాణ పనులు వెంటనే పూర్తయ్యేలా సిబ్బంది లబ్ధిదారులకు సహకరించాలన్నారు. అర్హులై ఉండి ఇళ్లు మంజూరుకాని వారికి వెంటనే మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో, పట్టణాలలో ఇళ్లు లేని నిరుపేద ఉండకూడదన్నారు. హౌసింగ్ డీఈ చంద్రశేఖర్, ఏఈ జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



పుల్లంపేట : పీవీజీపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను హెచ్ఎం కృష్ణవేణి ఆధ్వర్యంలో సన్మానించారు. పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు రెడ్డి ప్రసాద్ రాజంపేట మండలంలోని ఊటుకూరుకు బదిలీ కాగా, తెలుగు ఉపాధ్యాయుడు జి.వెంకటరమణ నందలూరులోని నాగిరెడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు, గణిత ఉపాధ్యాయురాలు దాసరి సుజిత కడప జైనగర్ కాలనీలోని బాలికోన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. దీంతో బదిలీ అయిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

సిద్దవటం : గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఉప్పరపల్లె, మాధవరం 1, 2, 3 వార్డులు, శాఖరాజుపల్లె సర్పంచ్‌లు మేరువ బాలాజీ, చేపూరి ఓబయ్య, టి.శ్రీకాంత్‌లు అన్నారు. సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని శ్రీ కనకదుర్గ కల్యాణ మండపంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష ద్వారా ప్రతి కుటుంబానికి ఉచితంగా 11 రకాల సరిఫ్టికెట్లను అందజేస్తున్నామన్నారు. సురక్ష ద్వారా సంక్షేమం అందని వారిని గుర్తించి పథకాలు అందజేస్తామన్నారు. ఎంపీడీఓ జవహర్‌బాబు, తహసీల్దారు లక్ష్మీదేవిలు మాట్లాడుతూ గృహాలు మంజూరైన లబ్ధిధారులు గృహాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ చెన్నయ్య మాట్లాడుతూ ఎవరికైతే ప్రభుత్వ గృహాలు మంజూరయ్యాయో వారికి మరుగు దొడ్లను నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ. 12 వేలు ఇస్తారన్నారు. అనంతరం లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉచితంగా ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, వైస్ ఎంపీపీ మల్లేశ్వరి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ నూర్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, స్థానిక నాయకులు మేరువ ఈశ్వరయ్య, కనపర్తి సుబ్బారెడ్డి, గౌడా రామచంద్రయ్య, సర్పంచ్ జానకిరామయ్య, ఆర్ఐ అనూరాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవిద్య, గ్రామ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, వీఆర్ఓ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'కడప ఉక్కు'పై కేంద్ర నిర్ణయం దుర్మార్గం

రాయచోటి అర్బన్ : కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని కేంద్రప్రభుత్వం పార్లమెంటులో ప్రకటించడం సిగ్గుచేటని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలేషాలు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఏఐఎస్‌బీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు ఐదుకోట్ల ఆంధ్రుల హక్కు అన్నారు. విభజన చట్టంలో కడపలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటుపై హామీ ఉన్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. పార్లమెంటు సాక్షిగా కేంద్రం చేసిన ప్రకటన ఐదుకోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని అన్నారు. ఉక్కు పరిశ్రమ కోసం ప్రజాప్రతినిధులంతా తమ పదవులకు రాజీనామాలు సమర్పించి ఉక్కుపోరులో భాగస్వాములు కావాలంటూ కోరారు. లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో రాయలసీమ ప్రాంతప్రజలు విద్యార్థులు, యువకులు తగు రీతిలో బుద్ధి చెబుతారంటూ హెచ్చరించారు. సమీర్, రామయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

31న సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

కడపలో ఉక్కుపరిశ్రమను స్థాపించలేమని ప్రకటించడం ద్వారా రాయలసీమకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో విమర్శించారు. విభజన చట్టం రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిన వాటిపై కేంద్రం నెరవేర్చక సీమకు తీరని ద్రోహం చేసిందన్నారు. రాయలసీమ డిక్లరేషన్‌కే కట్టుబడి ఉన్నామంటూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ప్రకటించిన 3రోజులకే ఉక్కుపరిశ్రమను స్థాపించలేమంటూ కేంద్రం ప్రకటించడం ఆ పార్టీ నయవంచనకు నిదర్శనమన్నారు. కేంద్ర వైఖరికి నిరసనగా సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 31న రాయచోటిలో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ కోరారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయచోటి అర్బన్ : దేశానికి ఒక శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఏపీజే అబ్దుల్ కలాం చేసిన సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, బేపారి మహమ్మద్‌ఖాన్‌లు అన్నారు. గురువారం పట్టణంలో అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్‌సీపీ నేతలు జాతీయ రహదారిలోని షాదీఖానా వద్ద ఉన్న కలాం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్పవ్యక్తి అబ్దుల్ కలాం అని అన్నారు. కలాం సేవలను గుర్తించి కేంద్రం భారత రత్న పురస్కారంతో సత్కరించిందన్నారు. దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో పయనించాలంటూ కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు గౌస్‌ఖాన్, కొలిమి చాన్‌బాషా, అల్తాఫ్, అసిఫ్ అలీఖాన్, ఈశ్వర్ ప్రసాద్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ నిస్సార్ అహమ్మద్, కో-ఆప్షన్ సభ్యులు అయ్యవార్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..

చిట్వేలి : 30వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పి.రాజశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం 8వ వర్ధంతిని ఎన్‌సీసీ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఏబీఎన్ ప్రసాద్‌లు మాట్లాడుతూ అబ్దుల్ కలాం జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు చంద్రయ్య, దుర్గరాజు, వెంకటసుబ్బయ్య, సుభాష్ చంద్రబోస్, కిరణ్ కుమార్ రాజు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణులకు రైళ్ల సౌకర్యం కల్పించండి



డీఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న తల్లెం భరత్

ఓబులవారిపల్లె : గ్రామీణ ప్రాంత ప్రజలకు రైళ్ల సౌకర్యాలు కల్పించాలని గుంతకల్ రైల్వే డివిజన్ మేనేజర్ మనీష్ అగర్వాల్‌ను డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్ రెడ్డి కోరారు. గురువారం గుంతకల్‌లో డీఆర్‌యూసీసీ బోర్డు సమావేశం నిర్వహించారు. సమావేశంలో భరత్ మాట్లాడుతూ రాజంపేట, రైల్వేకోడూరు, నందలూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేటలలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందించినట్టు పేర్కొన్నారు. అందులో రైల్వేకోడూరులో హరిప్రియ, చెన్నై-ముంబై సూపర్ ఫాస్ట్, చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌లకు స్టాపింగ్ కల్పించాలని, అదేవిధంగా ఓబులవారిపల్లె, పుల్లంపేటలలో తిరుమల, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు స్టాపింగ్ కల్పించాలన్నారు. ఓబులవారిపల్లె జంక్షన్ నుంచి కృష్ణపట్నం మార్గంలో ప్యాసింజర్ రైలును నడిపించాలని, మంగంపేట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి అక్కడి నుంచి బెరైటీస్ ఖనిజాన్ని కృష్ణపట్నం పోర్టుకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా నంద్యాల-కడప డెమో ప్యాసెంజర్ రైలును రేణిగుంట వరకు పొడిగించాలన్నారు. నందలూరు, రెడ్డిపల్లె రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని లేఖలో ప్రస్తావించినట్టు ఆయన తెలియజేశారు.

రాజంపేట ఆర్డీఓగా రామక్రిష్ణారెడ్డి

రాజంపేట : రాజంపేట నూతన ఆర్డీఓగా రామక్రిష్ణారెడ్డిని ఉన్నతాధికారులు నియమించారు. శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. ఇక్కడ సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఫర్మాన్ అహమ్మద్ ఖాన్‌ను జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతిపై రాయచోటి వెళ్లారు. రామక్రిష్ణారెడ్డి నంద్యాల తదితర ప్రాంతాలలో విధులు నిర్వహించినట్లు సమాచారం.